క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని కలిసిన రేగాటిపల్లి సురేష్‌రెడ్డి

ధర్మవరం రూరల్: ఇటీవల వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేగాటిపల్లి సురేష్‌రెడ్డి బుధవారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని ధర్మవరంలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వ్యాక్సినేషన్ తప్పనిసరి

పుట్టపర్తి అర్బన్: గర్భిణులు, చిన్నారులు ప్రతి ఒక్కరికీ వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని సీహెచ్‌ఓ నగేష్ పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తిలోని వివేకానంద నగర్‌లో గర్భిణులు, బాలింతలకు వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పించారు. సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించడం ద్వారా పలు రోగాలను నయం చేసుకోవచ్చన్నారు. శిశువు ఎదుగుదలకు ఇవి ఎంతో ఉపయోగకరమన్నారు. మాతాశిశు సంరక్షణ కార్డు, పిల్లల జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌ను జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు పుష్ప, మంజుల, అనుపమ సిబ్బంది ఉన్నారు.

వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం

చెన్నేకొత్తపల్లి: వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ముస్లింలు డిమాండ్ చేశారు. బుధవారం రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లోని ముస్లింలు 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులు పాల్గొని ముస్లింలకు మద్దతు పలికారు. తొలుత భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీ చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ సురేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం తీసుకుంటున్న రాజ్యాంగ విరుద్ధ నిర్ణయాలను కూటమి ప్రభుత్వం వ్యతిరేకించాలన్నారు. ఈ చట్టం ఉపసంహరించుకునే వరకూ ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

సమస్యలను పరిష్కరించండి



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

ఎన్పీకుంట: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఇందులో పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి 37, రెవెన్యూకు సంబంధించి 22 అర్జీలు ఉన్నాయి. కార్యక్రమంలో తహసీల్దార్ దేవేంద్ర నాయక్, ఎంపీపీ ఈటె రాము, సర్పంచ్ అంజినమ్మ, ఎంపీడీఓ అంజినప్ప, ఈఓపీఆర్డీ మాధవరెడ్డి, మైనార్టీ మోర్చా జిల్లా కార్యదర్శి సమీవుల్లా, కొసెట్టి రామ్మోహన్, దండే రవి, గంగిరెడ్డి, నరసింహులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కుమారునితో సహా వివాహిత అదృశ్యం

బత్తలపల్లి: వెంకటారిపల్లికి చెందిన ఓ వివాహిత తన మూడేళ్ల చిన్న కుమారుడితో మంగళవారం అదృశ్యమైంది. పనికి వెళ్లిన భర్త సాయంత్రం ఇంటికి వచ్చి చూస్తే భార్య, కుమారుడు కనిపించలేదు. బంధువుల ఇళ్లు, తెలిసిన చోట్ల వెదికినా జాడ కానరాలేదు. బుధవారం పోలీసు స్టేషన్‌కు వెళ్లి భార్య, కుమారుడి అదృశ్యంపై ఫిర్యాదు చేశాడు.

సంకష్టహర చతుర్థి



కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఆలయమైన ఉమామహేశ్వర ఆలయం(శివాలయం)లో బుధవారం రాత్రి గణపతి స్వామికి భక్తిశ్రద్ధలతో అర్చకులు సంకష్టహర చతుర్థి పూజ నిర్వహించారు. మహిళలు ఉదయం నుంచి ఉపవాసాలు ఉండి పూజలు చేశారు. చంద్రుని చూసిన తరువాత మహిళలు ఉపవాసదీక్ష విరమించారు.

దివ్యాంగుల పాఠశాల సందర్శన

కదిరి అర్బన్: రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత బుధవారం కదిరి మండలం మొటుకుపల్లిలో ఉన్న ఆర్డీటీ దివ్యాంగుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. వారి లైఫ్‌స్కిల్స్ గురించి నిర్వాహకులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం తనవంతు సాయంగా రూ.5 వేల నగదు అందజేశారు.

మార్కెట్‌కు మోక్షమెన్నడో?

> ఆధ్యాత్మిక నగరి, జిల్లా కేంద్రం పుట్టపర్తిలో శాశ్వత మార్కెట్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పక్కనే దుమ్ము, ధూళి, రణగొణ ధ్వనుల నడుమ కూరగాయల వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. సరుకు తాజాగా ఉంటుందని వస్తే అపరిశుభ్రత నడుమ కొనుగోలు చేయాల్సి వస్తోంది.

- జిల్లా కేంద్రంలో రోడ్డు పక్కనే కూరగాయల విక్రయాలు
- కొనుగోలుదారులతో తరచూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు
- శాశ్వత మార్కెట్ గురించి పట్టని ప్రజాప్రతినిధులు, అధికారులు



పుట్టపర్తి రోడ్డు పక్కన అమ్మకాలకు సిద్ధంగా ఉన్న కూరగాయలు

పుట్టపర్తి టౌన్: పంచాయతీ నుంచి నగర పంచాయతీగా, ఆ తర్వాత మున్సిపాలిటీగా పుట్టపర్తి రూపాంతరం చెందింది. అయితే స్థాయికి తగిన సౌకర్యాలు లేవు. ఎన్నడో వేసిన రోడ్లే నేటికీ ఉన్నాయి. రోడ్ల విస్తరణ చేయాల్సి ఉంది. పట్టణ ప్రజలతో పాటు దేశవిదేశాలకు చెందిన సత్యసాయి భక్తులతో సందడిగా ఉంటుంది. జిల్లా కేంద్రంగానూ ఉండటంతో ప్రభుత్వ శాఖలన్నీ ఇక్కడే కొలువుదీరాయి. అధికారులు, ఉద్యోగుల సంఖ్య కూడా పెరిగింది. అయితే ప్రజల సౌకర్యార్థం వారపు సంత నిర్వహణ, దినసరి కూరగాయల విక్రయాల కోసం ప్రత్యేకంగా మార్కెట్ లేదు. దీంతో రోడ్డు పక్కనే వారపు సంత నిర్వహిస్తున్నారు. రోడ్డుకు ఆనుకుని కూగాయలు, ఇతర నిత్యావసర సరుకులు పోసుకుని విక్రయాలు చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ దుస్థితిని కళ్లారా చూసినా అనువైన స్థలం ఎంపిక చేసి శాశ్వత మార్కెట్ ఏర్పాటు చేసే దిశగా దృష్టి సారించలేదు.

రైతు బేజారు

కొత్తచెరువు, పుట్టపర్తి, బుక్కపట్నం మండలాల్లో దాదాపు 24 వేల మంది రైతులు ఉన్నారు. ఇందులో 50 శాతం మంది కూరగాయలు, పండ్లతోటలు సాగు చేస్తున్నారు. వీరు పండించిన కూరగాయలను అమ్ముకోవడానికి జిల్లా కేంద్రంలో రైతుబజార్ లేదు. దీంతో దళారులు అడిగినకాటికి విక్రయించుకోవాల్సి వస్తోంది. అదే రైతు బజార్‌ను ఏర్పాటు చేస్తే రైతులు పండించిన కూరగాయలు, ఆకుకూరలను నేరుగా తీసుకొచ్చి దళారుల ప్రమేయం లేకుండా సరసమైన ధరలకే వినియోగదారులకు అందించే అవకాశం ఉంటుంది. తద్వారా గిట్టుబాటు ధర పొందవచ్చని రైతులు పేర్కొంటున్నారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మార్కెట్ ఏర్పాటు చేయాలి



పుట్టపర్తిలో ప్రజలకు అనుకూలంగా ఉండే విధంగా మార్కెట్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ప్రస్తుతం వారపు సంత మాత్రమే నిర్వహిస్తున్నారు. ఆ రోజు మాత్రమే కూరగాయలు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఆ రోజు కూడా విపరీతమైన రద్దీ ఉండటంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోంది. విశాలమైన స్థలాన్ని ఎంపిక చేసి మార్కెట్ ఏర్పాటు చేస్తే అందరికీ సౌకర్యవంతంగా ఉంటుంది.

– నరసింహులు, పుట్టపర్తి

ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి



జిల్లా కేంద్రంలో డైలీ మార్కెట్ ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి. ఆర్టీసీ డిపో ఎదుట ఇరిగేషన్ భూమి మార్కెట్‌కు కేటాయించి, చదును చేసి ఏర్పాటు చేయాలి. పట్టణ, గ్రామీణ ప్రజలతో పాటు ఉద్యోగులకు అనుకూలంగా ఉంటుంది. దుమ్ము, ధూళి నడుమ వ్యాపారాలు నిర్వహించడం సరికాదు. ప్రజల ఆరోగ్యం రీత్యా మార్కెట్‌ను పరిశుభ్రమైన చోట ఏర్పాటు చేయాలి.

– సుబ్రహ్మణ్యం, ఎనుములపల్లి

నివేదికలు పంపుతాం



పట్టణంలో మార్కెట్ ఏర్పాటు చేయడం మంచిదే. ప్రజలకు అనుకూలంగా ఉంటుంది. మున్సిపాలిటీ ఆదాయం కూడా పెరుగుతుంది. రెవెన్యూ అధికారులతో మాట్లాడి స్థలం కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటాం. మార్కెట్ ఏర్పాటుపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేసి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

– ప్రహ్లాద, మున్సిపల్ కమిషనర్, పుట్టపర్తి

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



విత్తనశుద్ధిని పరిశీలిస్తున్న ఏపీ సీఎన్‌ఎఫ్ సిబ్బంది, రైతులు

బత్తలపల్లి: ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకమని ఏపీ సీఎన్‌ఎఫ్ సీటీ, ఐఓ డీపీఎం లక్ష్మానాయక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఈదుల ముష్టూరు, మాల్యవంతం గ్రామాల్లో బత్తలపల్లి, తాడిమర్రి, చెన్నేకొత్తపల్లి మండలాలకు చెందిన ఏపీ సీఎన్‌ఎఫ్ సిబ్బంది పర్యటించారు. గోనుగుంట్ల స్వరూప పొలంలో ఆరు ఎకరాలలో పీఎండీఎస్‌లో ఐదు రకాల ప్రధాన పంటలు, 25 రకాల జీవవైవిధ్య పంటల విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేసి ఘన జీవామృతంతో పాటు విత్తనాలు విత్తారు. ఈ పంటలను పరిశీలించిన అనంతరం డీపీఎం లక్ష్మానాయక్ మాట్లాడుతూ బహుళ పంటల వల్ల కలుపు ఉండదని, నేల కోతకు గురికాదని తెలిపారు. ప్రధాన పంటలకు వాతావరణ వైపరీత్యాలకు తట్టుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. నేల గుల్లబారి వానపాములు వృద్ధి చెందుతాయన్నారు. ప్రధాన పంటల చీడపీడలు, తెగుళ్లను తట్టుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో నరేంద్ర, నవీన్, భానుమతి, ఐసీటీ సునీత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక పింఛన్ల తొలగింపు అన్యాయం



మాట్లాడుతున్న ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ

కనగానపల్లి: రాజకీయ దురుద్దేశంతో సామాజిక పింఛన్లు తొలగించడం అన్యాయమని ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి నామమాత్రంగానే ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. తొలుత శాఖల వారిగా అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ భాగ్యమ్మ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పలు గ్రామాల్లో సామాజిక పింఛన్లను తొలగిస్తున్నారన్నారు. రాజకీయ దురుద్దేశంతో అర్హులైన వారి పింఛన్లు తొలగించి వృద్ధులు, వికలాంగులకు అన్యాయం చేయడం తగదన్నారు. దీనిపై అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వటం లేదని మండిపడ్డారు. దీనిపై టీడీపీకి పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు లేచి గత ప్రభుత్వంలో కూడా కొన్నిచోట్ల పింఛన్లు తొలగించారని ఎంపీపీకి అడ్డుతగిలారు. ప్రస్తుతం సర్వేల ఆధారంగా అధికారులు అనర్హులను గుర్తించి పింఛన్లు తీసేస్తున్నారన్నారు. ఇందులో ఎక్కడా రాజకీయ దురుద్దేశం లేదని వాదనకు దిగారు. దీంతో సమావేశంలో సభ్యుల మధ్య కొంతసేపు వాడీవేడి చర్చ జరిగింది. సమావేశంలో ఎంపీడీఓ అనిల్ కుమార్, రాప్తాడు మార్కెట్‌యార్డ్ చైర్మన్ సుధాకర్ నాయుడు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు, నాయకులు

కదిరి టౌన్: మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జి.ఎల్. నరసింహులు మాట్లాడుతూ కారుణ్య నియామకాలు చేపట్టాలని, గత సంవత్సరం 17 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలకు సంబంధించిన జీఓలు ఇవ్వాలని, మున్సిపాలిటీలో పాడైపోయిన ట్రాక్టర్లకు మరమ్మతులు చేయాలని, పనిముట్లు ఇవ్వాలని, చెత్త సేకరణకు ఆటోలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఇన్‌చార్జ్ కమిషనర్ సాయి ప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జగన్మోహన్, ముస్తాక్, రామ్మోహన్, రఫి, మున్సిపల్ వర్కర్స్ నాయకులు తిరుపాల్, బాలకృష్ణ, జనార్దన్, చెన్నకృష్ణ, రామాంజులు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి మూల విగ్రహ ప్రతిష్ట



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న గ్రామస్తులు

బత్తలపల్లి: ఈదుల ముష్టూరులో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయంలో సీతారామ లక్ష్మణ, హనుమ, వినాయక, గరుడ సమేత మూల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఈ నెల 21 నుంచి మూడు రోజులు పాటు వైభవంగా నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను జయప్రదం చేయాలని గ్రామ పెద్దలు కోరారు. ఇదిలా ఉండగా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని బుధవారం ధర్మవరంలోని ఆయన స్వగృహంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ముష్టూరు నరసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్ ఆధ్వర్యంలో పీసీ ఆదినారాయణరెడ్డి, ఆదినారాయణ, సంజీవ, ఆదెప్ప తదితరులు కలిసి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించారు.

అగ్ని ప్రమాదాలపై నిర్లక్ష్యం వద్దు



పుట్టపర్తి శ్రీలీలా లేక్ వ్యూ అపార్టుమెంట్‌లో అవగాహన కలిగిస్తున్న ఫైర్ సిబ్బంది

పుట్టపర్తి టౌన్: అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలో శ్రీలీలా లేక్ వ్యూ అపార్టుమెంట్, హోటళ్లు, రద్దీ ప్రదేశాలతో పాటు కర్ణాటకనాగేపల్లి బ్రిడ్జి వద్ద గ్యాస్ స్టవ్‌లతో మాక్ డ్రిల్ విన్యాసాలతో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే ప్రాథమికంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణోపాయాల గురించి వివరించినట్లు ఏడీఎఫ్ఓ నాగరాజునాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

కదిరి: అగ్ని ప్రమాదాలపై నిర్లక్ష్యం వద్దని కదిరి అగ్నిమాపక కేంద్రం అధికారి ఎస్.శ్రీధర్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆయన తమ సిబ్బందితో కలిసి పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీలో అలకాపురి స్క్వేర్ అపార్ట్‌మెంట్, సైదాపురం ఎస్సీ కాలనీ, ఇంకా పలు ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అధికారి మాట్లాడుతూ వంటింట్లో గాలి, వెలుతురు ఉండాలని, వంట పూర్తి కాగానే స్టవ్‌తో పాటు రెగ్యులేటర్ ఆఫ్ చేయాలని సూచించారు. స్టవ్‌కు అమర్చిన పైప్ దెబ్బతింటే వెంటనే దాని స్థానంలో ఐఎస్ఐ మార్కు ఉన్న పైప్ అమర్చాలన్నారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది ఉత్తమరెడ్డి, శ్రీనివాసులు, చిరంజీవి, రమేష్‌రెడ్డి, రవీంద్ర నాయక్, అహ్మద్‌షా, అంజనప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: అగ్నిమాపక అధికారి యు.రాజు ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని జేఆర్ శిల్క్స్‌లో పనిచేస్తున్న సిబ్బందికి అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా బయట పడాలో డెమో ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, చేనేత కార్మికులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సద్బుద్ధి ప్రసాదించు స్వామీ



వినాయకునికి వినతిపత్రం సమర్పిస్తున్న కార్మికులు

పుట్టపర్తి టౌన్: తమ సమస్యలు పరిష్కరించే విధంగా రాష్ట్ర ప్రభుతావనికి సద్బుద్ధి ప్రసాదించాలని మున్సిపల్ వర్కర్లు వినాయకున్ని వేడుకున్నారు.. ఈ మేరకు మున్సిపల్ కార్మికులు బుధవారం పట్టణంలోని గణేష్ సర్కిల్‌లో వినాయక విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు చేస్తే మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ పైపల్లి గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థలం పరిశీలన



సున్నంపల్లి వద్ద వివాదాస్పద భూమిని పరిశీలిస్తున్న ఆర్డీఓ

ఓడీచెరువు : మండల కేంద్రంలోని శ్మశాన వాటిక స్థలాన్ని ఆర్డీఓ సువర్ణ బుధవారం పరిశీలించారు. శ్మశానవాటిక స్థలం ఆక్రమణకు గురికాకుండా పర్యవేక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అనంతరం సున్నంపల్లిలో వివాదాస్పద భూమిని పరిశీలించారు. అలాగే మండల కేంద్రంలోని బియ్యం గోదామును, సివిల్ సప్లయీస్ వారితో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనంతాచారి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ వేగవంతం చేయండి

ఓడీచెరువు : తల్లికి వందనం పథకానికి ఆధార్ తప్పనిసరి అయినందున.. ఆరేళ్లలోపు వయసుగల పిల్లల ఆధార్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవలను, ఇటీవల చేపట్టిన సర్వేల పురోగతిని పరిశీలించారు. 'స్పందన' అర్జీల పురోగతిపై అర్జీదారులతో ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్, ఏఓ వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ పద్మనాభ రెడ్డి పాల్గొన్నారు.



ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న జెడ్పీ సీఈఓ

సంక్షిప్త సమాచారం

రస్తా వివాదం పరిష్కారం

తనకల్లు: బొంతలపల్లిలో పొలాల రస్తా వివాదాన్ని తహసీల్దార్ శోభ సువర్ణమ్మ పరిష్కరించారు. కొన్నేళ్లుగా వివాదాస్పదంగా ఉన్న రస్తాను బుధవారం తహసీల్దార్ పరిశీలించారు. ఇరువర్గాల వారితో మాట్లాడి వంక పరంబోకు భూమిలో పొలాల కోసం దారి ఏర్పాటు చేసుకునేలా రైతులందరినీ ఒప్పించడంతో సమస్య పరిష్కారమైందని అధికారులు తెలిపారు.

సోషల్ మీడియా యాక్టివిస్టు బైండోవర్

తనకల్లు: మంగదిన్నెపల్లికి చెందిన సోషల్ మీడియా యాక్టివిస్ట్ జనార్దన్ నాయుడును తహసీల్దార్ శోభ సువర్ణమ్మ వద్ద బైండోవర్ చేసినట్లు ఎస్ఐ గోపి బుధవారం తెలిపారు. జనార్దన్‌నాయుడు తన ఫేస్‌బుక్ అకౌంట్‌లో వివాదాస్పదమైన పోస్ట్ పెట్టాడని క్రిమినల్ కేసు నమోదు చేసి, సైబర్ బుల్లీషీట్ ఓపెన్ చేశామని పేర్కొన్నారు.

ఆర్థికసాయం

కదిరి అర్బన్: గంగన్నగారిపల్లికి చెందిన గంగులప్ప ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. బుధవారం వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బత్తల హరిప్రసాద్ రూ. 5 వేల ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరటి తోటల పరిశీలన

తాడిమర్రి: పిన్నదరిలో మూడు రోజుల క్రితం గాలివానకు నేలకొరిగిన అరటి తోటలను బుధవారం జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు. జరిగిన నష్టాన్ని ప్రభుత్వానికి తెలియజేసి నష్ట పరిహారం అందించేలా కృషి చేస్తానని ఆయన రైతులకు హామీ ఇచ్చారు.

కక్ష సాధింపు సరికాదు

ముదిగుబ్బ: నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై కేంద్రం ఇబ్బంది పెట్టడం సరి కాదని ధర్మవరం నియోజకవర్గం పీసీసీ ప్రతినిధి నిస్సార్ అహ్మద్ ఖండించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

దరఖాస్తు చేసుకోండి

ముదిగుబ్బ: వ్యవసాయ యాంత్రీకీకరణ పథకంలో భాగంగా ట్రాక్టర్‌కు సంబంధించిన వ్యవసాయ పరికరాలు, స్ప్రేయర్లు తదితర వాటి కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి లక్ష్మీనరసింహులు బుధవారం కోరారు. మరిన్ని వివరాల కోసం సచివాలయ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

విద్యార్థుల నమోదు చేపట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓలు

గాండ్లపెంట: వచ్చే ఏడాది విద్యా సంవత్సరానికి గాను పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ప్రక్రియను ఈ నెల 21, 22, 23 తేదీల్లో చేపట్టాలని ఎంఈఓలు కృష్ణానాయక్, శ్రీనివాసులు బుధవారం తెలిపారు. మండల విద్యాధికారి కార్యాలయంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఎంఈఓలు మాట్లాడుతూ 2024–25 ఏడాదికి సంబంధించి విద్యార్థుల ఎఫ్ఏ నుంచి చివరి పరీక్షల వరకు మార్కులను ఆన్‌లైన్ చేయాలని, అదే విధంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రస్తుతం అర్హులైన విద్యార్థులను రాబోయే విద్యాసంవత్సరానికి 1వ తరగతిలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పాఠశాల పరిధిలోని ప్రతి గ్రామంలోనూ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. కాగా మలమీదపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా స్థాయి పెంచినట్లు చెప్పారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి మలమీదపల్లి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి తరగతులు ప్రారంభం కానున్నట్లు చెప్పారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి



ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పుట్టపర్తి టౌన్: ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌ఓ నగేష్ పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తిలో చిత్రావతి రోడ్డు, వివేకానందరోడ్డు, గ్రౌండ్ ఏరియా ప్రాంతంలో అసాంక్రమిక వ్యాధులు, వడదెబ్బపై ప్రజజలకు అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లు, ఆరోగ్యకరమైన ఆహారం, వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించి ఆరోగ్యకరమైన జీవనం గడపాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ప్రయాణాలను ఉదయం పది గంటలలోపు, సాయంత్రం 3 గంటలపైన ఉండేలా చూసుకోవాలన్నారు. బయటకు వచ్చేటపుడు గొడుగు తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలన్నారు. మంచినీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు పుష్ప, అంజలి, అనుపమ, ఆశా వర్కర్లు కాంతమ్మ, నాగరత్నమ్మ, ఉమ, రత్న తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పోషకాహారాన్ని పంపిణీ చేస్తున్న సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ

తనకల్లు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ అన్నారు. కోటపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ ప్రతి తల్లీ తన బిడ్డకు చిన్నప్పటి నుంచే పోషక విలువలున్న ఆహారాన్ని అందిస్తే భవిష్యత్‌లో ఎటువంటి రోగాలూ దరి చేరవన్నారు. ఆకుకూరలు, కూరగాయలను ఆహారంలో ఎక్కువగా తీసుకోవాలని, ఫాస్ట్‌ఫుడ్ జోలికి వెళ్లరాదని సూచించారు. లోప పోషణ గురైన చిన్నారులను గుర్తించి న్యూట్రీషన్ రిహాబిలిటేషన్ సెంటర్లకు పంపాలన్నారు. అనంతరం పోషకాహారాన్ని పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు భాగ్యమ్మ, సాయిలక్ష్మీ, మాధవి, మంజుల, మగ్బుల్‌బీ తదితరులు పాల్గొన్నారు.